















వానర విన్యాసం







తిరుపతి తాతయ్యగుంట గంగ జాతరను ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా యువకులు, చిన్న పిల్లలు, మహిళలు కూడా వివిధ వేషాలు ధరించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నేపథ్యంలో రేణిగుంటకు చెందిన గోపి తాను పెంచుకుంటున్న వానరానికి రంగులు పూసి రంగు రంగుల దుస్తులు ధరింపజేసి అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చాడు. అక్కడ వానరం కావడి మోస్తూ నృత్యంచేస్తూ సందడి చేస్తోంది. దీన్ని చూసి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వానరం పేరు సిల్కీ అని. పేరు పెట్టి పిలిస్తే హుషారుగా గెంతుతూ డ్యాన్స్ చేస్తుందని గోపి తెలిపాడు. –సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నంది వాహనంపై విహరించిన సిద్ధేశ్వరుడు

భాకరాపేట: తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామి, శ్రీ సిద్ధేశ్వరి అమ్మ వారు సోమవారం సాయంత్రం ప్రదోష కాల సమయంలో నంది వాహనంపై విహరించారు. స్వామి అమ్మ వార్లను తెల్లవారు జామున సుప్రభాతంతో మేల్కొలిపి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం, అర్చనలు చేశారు. ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ప్రదోష కాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నంది వాహనంపై కొలువుదీర్చి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.





ప్రత్యేకాలంకరణలో శ్రీ సిద్ధేశ్వర స్వామి, అమ్మవారు

తిరుపతి గంగమ్మకు శాస్త్రోక్తంగా పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మ ఆలయంలో సోమవారం తిరుపతి గంగ జాతరను పురస్కరించుకుని ఆనవాయితీగా నిర్వహించే పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారికి పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం పెద్ద యెత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం తిరుపతి గంగమ్మకు పెద్ద యెత్తున పొంగళ్లు పెట్టేందుకు భక్తులు వస్తుండడంతో జాతీయ రహదారిలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లు చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో తిరుపతి గంగమ్మ

మెరుగైన సేవలు అందించడానికి సహకరించండి



ఆర్టీసీ ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: మెరుగైన సేవలు అందించడానికి ఆర్టీసీ ఉద్యోగులు సహకరించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం తిరుపతిలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలతో పాటు బస్సుల కండిషన్, ఆదాయ మార్గాలు, పల్లె ప్రాంతాలకు సర్వీసుల ఏర్పాటు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. 2022 శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీర్ నరసింహులు, ట్రాఫిక్ చీఫ్ మేనేజర్ భాస్కర్, పీవో పార్థసారథి, అకౌంటెంట్ చంద్రముని పాల్గొన్నారు.

డివిజనల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా శంకరయ్య



రామచంద్రాపురం: మండలంలోని కమ్మపల్లి ఏఏడబ్ల్యూ గ్రామానికి చెందిన శంకరయ్యను తిరుపతి డివిజన్ ఎస్సీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ఆర్డీఓ కనక నరసారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శంకరయ్య సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



బాలసౌరి



అన్నామలై

తిరుమల: శ్రీవారిని సోమవారం పార్లమెంట్ కమిటీ చైర్మన్ బాలసౌరి, తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించండి



రామచంద్రాపురం తహసీల్దార్‌కు గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన సమస్యలను తెలియజేస్తున్న ఉదయగిరి రమేష్

తిరుపతి రూరల్: స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని గ్రీవెన్స్ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి రమేష్ కోరారు. ఆయన సోమవారం రామచంద్రాపురం తహసీల్దార్ వెంకటేశ్వర్లును కలిసి విన్నవించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ సెల్ కృషి చేస్తుందన్నారు. రామచంద్రాపురం మండలానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన తహసీల్దార్‌కు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సురేష్, రియాజ్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమస్యలపై వినతి

- రాష్ట్ర జీఎస్‌డబ్ల్యూస్ డైరెక్టర్ జి.లక్ష్మీషాకు వినతి

పుత్తూరు రూరల్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సాధారణ బదిలీలతో పాటు పేస్కేల్ వర్తింపు వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డెమొక్రటిక్ ఏపీ జీఎస్‌డబ్ల్యూస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోసెఫ్ కిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలు జిల్లాల నాయకులతో కలసి విజయవాడ నిర్మాణ్ భవన్‌లో రాష్ట్ర జీఎస్‌డబ్ల్యూస్ డైరెక్టర్ జి.లక్ష్మీషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొబేషన్ పూర్తయిన ప్రతి సచివాలయ ఉద్యోగికి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేయాలని కోరారు. బదిలీల జీవోను విడుదల చేసి వెంటనే బదిలీలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని, ఫీల్డ్ వర్క్‌కు టీఏ, డీఏలను అమలు చేయాలని కోరారు. తమ వినతి పత్రం స్వీకరించిన డైరెక్టర్ లక్ష్మీషా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు చాంద్‌బాషా, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విక్రమాదిత్య, కిషోర్ పాల్గొన్నారు.





















తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర శుభాకాంక్షలు

రేపు బీపీ అగ్రహారం గంగమ్మ జాతర


జాతరకు విద్యుత్ దీపాలంకరణ

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తి పట్టణంలోని బీపీ అగ్రహారం గంగమ్మ జాతరను బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం తెల్లవారు జామున గంగమ్మను ఊరేగించి నడివీధిలోని గంగమ్మ చావడి వద్ద ప్రతిష్ఠిస్తారు. జాతర జరిగే బీపీ అగ్రహారం, ఎఎం పుత్తూరు, ప్రాజెక్టువీధి, పానగల్ వార్డులలో శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఆధ్వర్యంలో జోరుగా పారిశుధ్యం పనులు చేశారు. ఇక, గంగమ్మ చావడి చుట్టూ విద్యుత్ దీపకాంతులతో ఆకట్టుకునేలా వివిధ దేవతా మూర్తుల కటౌట్‌లతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలో పానగల్ సమీపంలోని పోన్నాలమ్మ దేవస్థానం వద్ద మంగళవారం మహిళలు పొంగళ్లు పెట్టనున్నారు. బుధవారం జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ భీమారావు ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ అంజూయాదవ్ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


శ్రీధర్‌ను సన్మానిస్తున్న రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

రేణిగుంట: రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని రేణిగుంట రైల్వే పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు కోరారు. ఆల్ ఇండియా రైల్వే రిటైర్డ్ మెన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు యస్.శ్రీధర్‌ను రేణిగుంట యూనియన్ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఫిక్స్‌డ్ మెడికల్ అలవెన్స్ ఇవ్వడం ఆపి వేసి రైల్వే పెన్షనర్లకు అన్ని వ్యాధులకు వైద్య సేవలు అందించేలా చూడాలని, యూఎంఐడీ కార్డులు వచ్చేలా చూడాలని, రైల్వే బోర్డు (న్యూఢిల్లీ) స్థాయి, జనరల్ మేనేజర్ స్థాయిలో చర్చించి రైల్వే పెన్షనర్ల సమస్యలకు సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. పెన్షన్ పే ఆర్డర్ ప్రతి పే కమిషన్ అమలు చేయాలన్నారు. పెన్షనర్ల సమస్యలు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని శ్రీధర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ చైర్మన్ వి.రామమూర్తి, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ జయంత్ కుమార్, జాయింట్ సెక్రటరీ రంగయ్య, అసిస్టెంట్ సెక్రటరి ఆర్ఎస్ జ్ఞానశేఖర్, సి.చంద్రశేఖర్, జీవా ఆచారి, ఆర్.రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట రూరల్ సీఐగా సుబ్బరాయుడు



రేణిగుంట: రేణిగుంట రూరల్ సీఐగా బి.సుబ్బరాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా బనగాలపల్లె నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, శాంతిభద్రతలను పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని ఆయన చెప్పారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు, కాంపాళెం గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, కాటూరు, ఆదిరెడ్డికండ్రిగ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేయానికి సహాయకురాలి పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజర్లు రత్నమ్మ, శిల్ప కోరారు. సోమవారం ఆమె స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద పోస్టు వివరాల నోటిఫికేషన్‌ను అతికించారు. ఆమె మాట్లాడుతూ, కాంపాళెం దళితవాడలో ఎస్సీ, కాటూరులో ఓసీ, కాటూరు, ఆదిరెడ్డికండ్రిగ గ్రామాల్లోని ఓసీ కేటగిరి వారు ఆ పోస్టులకు అర్హులని తెలిపారు.

గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో ప్రవేశం

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 3 నుంచి 9వ తరగతి వరకు గల ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.రఘునాథరావు, హాస్టల్ వార్డెన్ బి.మునిరత్నం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలోని మొత్తం 40 సీట్లలో ఎస్టీలకు 32, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీకి 1 కేటాయించినట్లు తెలిపారు. 4వ తరగతిలో 39 సీట్లు, 5వ తరగతిలో 36, 6వ తరగతిలో 27, 7వ తరగతిలో 23, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో 20 ఖాళీలు ఉన్నాయని వివరించారు. ఈ అన్ని సీట్లు ఎస్టీలకు మాత్రమే కేటాయించబడినవి అని స్పష్టం చేశారు. ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులను నేరుగా పాఠశాలలో అందజేయాలని కోరారు. దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణపత్రం, టీసీ, ఇతర ధ్రువ పత్రాలను అందజేయాలని తెలిపారు. ఎంపిక విధానం లాటరీ పద్ధతిలో ఉంటుందని తెలిపారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

కార్వేటినగరం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని పాలసముద్రం, కార్వేటినగరం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం మండలాల్లో అక్రమంగా సారా, వివిధ కేసుల్లో ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అనంతపురం వారి ఆదేశాల మేరకు సెబ్ చిత్తూరు వారి ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందస్తుగా ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

నగరిలో..

నగరి: నగరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ వర్ధనాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వాహనాల వేలం ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి కలిగి వేలంలో పాల్గొనదలచిన వారు జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. వివరాలకు సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

కమనీయం.. ద్రౌపదీ దేవి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి కల్యాణం కనులవిందుగా జరిగింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణిచే హరికథ కాలక్షేపం జరిగింది. సాయంత్రం ఆలయ ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ముస్తాబు చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగళ్యధారణ చేశారు. కల్యాణోత్సవంలో చుటుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో యూనియన్ బ్యాంక్ ప్రారంభం


బ్యాంక్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : తిరుపతి పద్మావతి నిలయంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్‌ను సోమవారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీ, డీఆర్వో ఎం.సత్యనారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుభాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణస్వామి పూజ చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి రాంప్రసాద్, డిప్యూటీ రీజనల్ హెడ్ శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ నగేష్ కుమార్, మేనేజర్లు మణిప్రశాంత్, కార్తీక్ కుమార్ రావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్ పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ వెంకటసుబ్బమ్మ, ఎంపీడీఓ మహ్మద్ రఫీ

రామచంద్రాపురం: సెలవుల్లో సరదాగా సమ్మర్ క్యాంపు పుస్తకాలను సోమవారం ఎంఈఓ వెంకటసుబ్బమ్మ, ఎంపీడీఓ మహ్మద్ రఫీ ఉపాధ్యాయులకు అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని 56 పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సెలవుల్లో సరదాగా సమ్మర్ క్యాంపు పుస్తకాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. వాటిని ప్రతి విద్యార్థీ చదివేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు.

వారపు సంతలో రైతులకు భోజన వితరణ


వారపు సంతలో భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత నిధులతో రైతులు, వ్యాపారులకు భోజన వితరణం చేశారు. సన్న, చిన్నకారు రైతులు, వ్యాపారులు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో భోజనం పెడుతున్నట్టు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. తమ కష్టాన్ని గుర్తించి ఆకలి తీరుస్తున్న ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తామని పేర్కొన్నారు.

జనార్దన్‌కు కళాభూషణ అవార్డు


డి.జనార్దన్‌ను అవార్డుతో సత్కరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: మెగా కల్చరల్ అధ్యక్షుడు డి.జనార్దన్‌కు శ్రీవంశీ కళాక్షేత్రం నిర్వాహకులు కళాభూషణ అవార్డుతో ఘనంగా సత్కరించారు. మహతి కళాక్షేత్రంలో మూడు రోజులుగా శ్రీవంశీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో తెలుగు ఆరాధనోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా న్యాయవాది వృత్తిలో రాణించడంతోపాటు మెగా కల్చరల్ ఆధ్వర్యంలో కళామ తల్లికి జనార్దన్ అందించిన సేవలను గుర్తించి వార్డును అందజేశారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి సత్యనారాయణపురం విజయపురానికి చెందిన టీ.అంజనేయులుకు 6 నెలల జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పుచెప్పారు. తిరుపతి బొమ్మగుంట ఎస్‌సీబీ కాలనీకి చెందిన బి.సురేష్ వద్ద 2015 మార్చిలో అంజనేయులు రూ.3 లక్షలు అప్పుగా తీసుకుని ప్రాంసరీ నోట్ రాసిచ్చాడు. అసలు, వడ్డీ చెల్లించే క్రమంలో అతను 2016 ఆగస్టు 22వ తేదీ రూ.4 లక్షలు విలువచేసే చెక్కు ఇచ్చాడు. దాన్ని అతను బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యింది. సురేష్ ఈ విషయాన్ని అంజనేయులుకు చెప్పాడు. అతను తిరిగి 2016 డిసెంబర్ 29వ తేదీన రూ.4.50 లక్షల చెక్కు తిరిగి సురేష్‌కు ఇచ్చాడు. అతను ఆ చెక్‌ను బ్యాంకులో వేయగా అదీ బౌన్స్ అయ్యింది. దీంతో సురేష్ కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వోపరాలు పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.


విశేషాలంకరణలో గంగమ్మ

చల్లంగా చూడు.. గంగమ్మ తల్లీ


అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు


దుర్గాదేవి వేషధారణలో కళాకారుడు

- వేడుకగా గంగమ్మకు శాంతి అభిషేకం
- భక్తుల పూజలందుకున్న సున్నపు కుండలు

తిరుపతి కల్చరల్: కరుణ చూపి.. చల్లంగా చూడు గంగమ్మ తల్లీ అంటూ భక్తులు సోమవారం తాతయ్యగుంట గంగమ్మను వేడుకున్నారు. జాతరలో భాగంగా పెద్ద గంగమ్మ, చిన్నగంగమ్మకు ప్రతీకగా కైకాల కులస్తులు సోమవారం సున్నపు కుండల వేషాలు ధరించి నగరంలో తిరుగుతూ పూజలందుకున్నారు. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేక అలంకరణలో కొలువుతీర్చారు. భక్తులు గంగ వేషాలతో పాటు వివిధ పౌరాణిక, జానపద వేషాలు వేసుకొని చిందులు వేస్తూ సందడి చేశారు. గంగమ్మ వివిధ వేషాల్లో తిరుగుతూ మహిళలను వేధిస్తున్న పాలెగాడిని సంహరించడం జాతర విశిష్టత. జాతర చాటు నుంచి బైరాగి వేషం మొదలు దొరవేషం వరకు విభిన్న వేషాలు ధరించిన అమ్మవారు పాలేగాడిని సంహరించి, మాతంగి వేషంతో ఓదార్పునిస్తుంది. ఇలా వారం రోజులు విభిన్న వేషాలతో అలసిన గంగమ్మను శాంతిపజేసేందుకు సంప్రదాయబద్ధంగా సోమవారం అర్ధరాత్రి అర్చకులు ప్రత్యేక అభిషేకం చేపట్టారు.

నేడు 'పేరంటాల' వేషం

జాతరలో భాగంగా మంగళవారం కైకాల కులస్తులు పేరంటాల వేషం ధరిస్తారు. ఎర్రడల్లచీర ధరించి తలకు నల్లని గుడ్డ కట్టి ఒడిబాలు కట్టుకుని బంగారంలా అట్టలతో చేసిన ఆభరణాలతో ముస్తాబైన పేరాంటాలు పంబల వాయిద్యాతో చాటు మండపం వద్ద పూజలు చేసి నగరంలో పూజలు అందుకుంటారు. మంగళవారం వేకువజామున ఆలయానికి చేరుకుని చిన్నగంగమ్మ తర్వాత పెద్ద గంగమ్మ చెంపనరకడంతో జాతర సమాప్తమవుతుంది.

నేటి రాత్రి కొలువు తీరనున్న గంగమ్మ విశ్వరూప ప్రతిమ

తిరుపతి గంగజాతరలో భాగంగా చివరిరోజు రాత్రి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని అమ్మవారి విశ్వరూప కొడి స్తంభంపై విశ్వరూప ప్రతిమను ఏర్పాటుచేస్తారు. కుమ్మరి, చాకలి, విశ్వబ్రాహ్మణ, కంసాలి, దళితులు, మంగళి, గొల్లవంటి అన్ని కులాల సమ్మేళనంతో భక్తి ప్రపత్తుల నడుమ భక్తులకు అమ్మవారి విశ్వరూప ప్రతిమ దర్శనం కలుగనుంది. చాటింపుతో ప్రారంభమైన వివిధ వేషాలు, మొక్కులు, వినోదాలు, వివిధ పూజలతో సాగి చిట్టచివర గంగమ్మ చెంప నరకడంతో జాతర ముగుస్తుంది.

భక్తులకు అన్నదానం

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని మాజీ ఎంపీపీ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. మేయర్ శిరీష ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వెయ్యి మంది భక్తులకు పులిహోర, పెరుగన్నం, పొంగళి, విజిటబుల్ బిర్యానీ, సాంబార్ అన్నం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ హేమాద్రి రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దత్తా గణేష్ యాదవ్, వెంకటేష్, కిరీటిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.


వేయికళ్ల దుత్తలతో ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష


కొమ్ముకోయ ధరించి కళాప్రదర్శన చేస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కళాకారులు


అన్నదానం చేస్తున్న మేయర్ శిరీష, నిర్వాహకులు


గంగబొట్లు, వేషధారణలో సందడి చేస్తున్న మహిళలు


కళాకారుల ప్రదర్శన


ఆకట్టుకుంటున్న సప్పరం


వేయికళ్ల దుత్తలు తీసుకుని ఆలయానికి వచ్చిన పిల్లలు, మహిళలు


యువకుల కేరింతలు


వేషధారణలో ఆలయానికి వచ్చిన యువకులు


డప్పు కొడుతూ కళాకారుల విన్యాసం

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలి


ప్రజాప్రతినిధులతో సమీక్షిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- టెక్నికల్ సమస్యలపై అర్జీదారుడికి వివరంగా చెప్పాలి
- తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- పంచాయతీల వారీగా నివేదికలపై సమీక్ష

తిరుపతి రూరల్: మండలంలో జరిగిన గడప గడపకూ మహా పాదయాత్రలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించాలని ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం పాదయాత్రలో వచ్చిన అర్జీల పరిష్కారం, పెండింగ్ సమస్యలపై అధికారుల నివేదికపై ఎంపీపీ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలోని రణధీర్ పురం, సప్తగిరికాలనీ, మంగళం క్వార్టర్స్, తిరుమల నగర్, శెట్టిపల్లి పంచాయతీలో వచ్చిన అర్జీల్లో 90 శాతం పరిష్కరించినట్లు అధికారుల ఇచ్చిన నివేదికను పరిశీలించారు. కొందరు అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం అయిందా... అంటూ ఆరా తీశారు. సమష్టిగా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎంపీడీఓ వెంకటనారాయణ, అధికారులను అభినందించారు. పెండింగ్‌లో ఉన్న వాటి పరిష్కారంపై జిల్లా కలెక్టర్, జేసీ, ఆర్డీవోలతో ఫోన్‌లో మాట్లాడారు. టెక్నికల్‌గా ఇబ్బందులు ఉన్న విషయాలను అర్జీదారులకు రాత పూర్వకంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను ర్యాండమ్‌గా చెక్ చేస్తానని, అధికారుల నిర్లక్ష్యం వల్ల పరిష్కారం కాలేదని ఎవరైనా చెబితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై సమీక్ష చేయాలని ఎంపీడీవో వెంకటనారాయణకు సూచించారు. ఈ సమావేశంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం


ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా : స్పందన, డయల్ యువర్ కమిషనర్‌కు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖధిపతులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్‌కు 19, స్పందనకు 26 ఫిర్యాదులు అందాయన్నారు. సమస్య తీవ్రతను బట్టి వారంలోపు పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, అదనపు కమిషనర్ సునీత, ఉపకమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, ఆర్‌వో కె.ఎల్ వర్మ, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

వెకేషన్ కోర్టు సిట్టింగ్ ప్రాంతాల ఖరారు

తిరుపతి లీగల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అదనపు జిల్లా జడ్జి కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు సోమవారం నుంచి వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో అత్యవసర కేసులను విచారించడానికి రాష్ట్ర హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు వెకేషన్ కోర్టు మొదటి పీరియడ్ సిట్టింగ్ ప్రాంతాలు ఏఏ తేదీల్లో కోర్టు ఆయా ప్రాంతంలో నిర్వహించే తేదీలను ఖరారు చేస్తూ వెకేషన్ కోర్టు జడ్జి, చిత్తూరు మొదటి అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేష్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మొదటి పీరియడ్ వెకేషన్ జడ్జిగా ఉన్న ఎస్.రమేష్ ఈ నెల 17, 18, 19, 23, 25 తేదీల్లో చిత్తూరులోనూ, ఈ నెల 22, 29 తేదీల్లో మదనపల్లెలోనూ, ఈ నెల 16, 26వ తేదీల్లో తిరుపతిలోనూ, ఈ నెల 24వ తేదీ పీలేరులో వెకేషన్ కోర్టు నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. అత్యవసర కేసులు దాఖలుచేసి ఉత్తర్వులు పొందవలసిన కక్షిదారులు ఈ వెకేషన్ కోర్టుల్లో కేసులు దాఖలు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో తెలిపారు.

రెండు పిస్టల్స్ తరలిస్తున్న ఇద్దరికి జరిమానా

తిరుపతి లీగల్ : లైసెన్స్ గల రెండు పిస్టల్స్‌ను తిరుమలకు తరలిస్తున్న ఇద్దరికి వేర్వేరు కేసుల్లో ఒక్కొక్కరికీ రూ.2000 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పుచెప్పారు. మహారాష్ట్రకు చెందిన విజయ్‌శరత్‌మణి, సుధాకర్ గణపతికుంజు 2017లో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. తిరుమలకు మారణాయుధాలు తరలించకూడదనే విషయాన్ని తెలుసుకోకుండా వారు తమ వాహనాల్లో తిరుమలకు పిస్టల్స్‌ను తీసుకెళ్లారు. తిరుమల టోల్‌గేట్ వద్ద విజిలెన్స్ సిబ్బంది గుర్తించి ఇద్దరినీ అదుపులోకి తీసుకుని తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. సోమవారం కేసు వాయిదాకు హాజరైన ఇద్దరు తాము తెలియక నేరం చేశామని న్యాయమూర్తికి తెలిపారు. దీంతో న్యాయమూర్తి ఇద్దరికీ వేర్వేరుగా జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదంటూ న్యాయమూర్తి వారికి సూచించారు.

నగరంలోని రోడ్లకు మహర్దశ


రోడ్డును పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

- చరిత్రలో నిలిచిపోయేలా మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం
- గ్రాండ్ వరల్డ్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి పుణ్యక్షేత్రంలోని రోడ్లకు మహర్దశ పట్టింది. నగరంలోని ఏ కాలనీలో చూసినా సీసీరోడ్లు, బీటీ రోడ్లతో కలకలలాడుతున్నాయి. గతంలో గంతలమయంగా ఉన్న రోడ్లపై నడవడానికే ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం సీసీరోడ్లు, బీటీరోడ్లు వేయడంతో పాదచారులు, వాహనదారులు సురక్షిత ప్రయాణం సాగిస్తున్నారు. తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాలతో డిప్యూటి మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. తిరుపతి నగరంలోని గ్రాండ్ వరల్డ్ రోడ్డులో రూ.85 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని సోమవారం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పరిశీలించారు. రోడ్డు నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. 50వ డివిజన్‌లో ఇంకేమైనా రోడ్డు పూర్తి చేయాల్సినవి ఉన్నాయా అని ఆ డివిజన్ కార్పొరేటర్ బోకం అనీల్‌కుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా సీసీరోడ్లు లేని కాలనీలు ఉండరాదని చెప్పారు.

మారుతి సుజుకి కొత్త ఫ్రాంక్స్ కారు విడుదల


కారును ఆవిష్కరిస్తున్న బసిరెడ్డి, షోరూం, నెక్సా ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని భార్గవి ఆటో మొబైల్స్ షోరూంలో సోమవారం మారుతి సుజుకి నెక్సా వారి కొత్త ఫ్రాంక్స్ కారును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేటీసీ బసిరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నెక్సా అందుబాటులోకి తెచ్చిన సరికొత్త ఫ్యూచర్స్ ఫ్రాంక్స్ కారు మధ్య తరగతి వారికి సైతం అందుబాటు ధరల్లో అందించడం అభినందనీయమన్నారు. భార్గవి ఆటో మొబైల్స్ ఎండీ కొండా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త ఫ్రాంక్స్ కారు 10 వేరియంట్స్‌లో సిగ్మా, డెల్టా, డెల్టా ప్లస్, జీటా, ఆల్ఫా మోడళ్లలో ఉందన్నారు. ఇందులో ఆరు రంగులు, 3 డ్యూయల్ కలర్స్‌తో లభిస్తుందని తెలిపారు. అంతేకాక హెడ్ అఫ్ డిస్‌ప్లే, వైర్లెస్ చార్జర్, 360 డిగ్రీస్ కెమెరా, జియో మెట్రిక్ ప్రాసిషన్, కట్ అలయ్ వీల్స్ వంటి అత్యాధునిక ఫీచర్లతో ఒక లీటర్ టర్బో బూస్టర్ జెట్, 1.2 లీటర్స్ కె.సిరీస్ డ్యూయల్ జెట్ వీవీ టీ ఇంజిన్ ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భార్గవి ఆటో మొబైల్స్ జీఎం వి.రవికుమార్, రమేష్‌బాబు, నెక్సా జీఎం విజయ్‌కుమార్, టీడీఎం కనకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.